# సింగిల్ పేజీ కథలు

## నిశ్చలచిత్రం

అటువంటి దయనీయమైన పరిస్థితి ఎదురవుతుందని ఎప్పుడూ ఊహించలేకపోవడంతో అసంకల్పితంగా ఆమె నయనాలు అశ్రుపూరితాలయ్యాయి. మనసు నిబ్బరపరుచుకుని...ఒక్కొక్క పదం కూడగట్టుకుని "సురేష్ అసలు నేను చేసిన తప్పేంటి? ఇన్నాళ్ళు మనం కలిసుంది కేవలం భార్యభర్తలగానేనా? ప్రపంచంలో మనకు మించిన ప్రేమికులు ఎవరూ ఉండరని ఎన్నిసార్లు అనుకోలేదు. పైగా ఇప్పుడు మీ ప్రతిరూపం నాలో పెరుగుతుంది. ఈ సమయంలో ఇలా మాట్లాడడం.." అంది.

ఎంత ఆపుకుందామని ప్రయత్నించినా ఆగలేదు.

అవును మరి, ఏ స్త్రీ మాత్రం సహించగలదు. చాలా ప్రేమగా చూసుకునే తన భర్త గర్భవతి అయిన కొన్నిరోజులకే ఏదో వంక పెట్టి "మనం విడిపోదాం" అంటే ఎవరు దుఃఖితులవ్వరు! ప్రస్తుతం ఆమె అదే స్థితిలో ఉంది.

"సరిగా ఆలోచించు. సులోచన. ఒకప్పుడు నీ తల్లి ఏంచేసిందో గుర్తుతెచ్చుకో. అప్పుడు కూడా ఆమె గర్భవతే"అతడేదో అనబోతుంటే

"అయితే...!?" విస్మయంగా ప్రశ్నించింది.

"భర్త వదిలేసిన భార్యలను ఈలోకం ఎంత 'ఇది'గా చూస్తుందో.. అంతకంటే దారుణంగాను, నీచంగానూ భార్య వదిలేసిన భర్తనూ చూస్తుంది. నీ తండ్రి అనుభవించిన క్షోభ, బాధ... ఇవేమీ నీకు తెలీదు. ఎంతైనా జమీందారిణివి కదా! అదే సంఘటన పునరావృతం కాకూడదన్న ఉద్దేశ్యంతో నేనీ నిర్ణయాన్ని తీసుకున్నాను. ఎందుకంటే నువ్వూ ఆ తల్లి కూతురివే కదా...అదే బుద్ధి నీలో ఎప్పటికైనా..." అతడి మాటలు పూర్తికాలేదు.

"స్టాపిట్" ఆమె అరుపునకు అతడు ఉలిక్కిపడ్డాడు.

క్షణం క్రితం నీళ్లతో నిండిన ఆ కనులు, ఇప్పుడు చండ్రనిప్పులు కురిపిస్తున్నట్టుగా ఉన్నాయి. ఆమె కోపంతో ఊగిపోతూ అతడి దగ్గరకొచ్చి బలంగా... చాచి కొట్టింది.

"కట్!"

డైరెక్టర్ కేకతో... అప్పటివరకూ ఎంతో ఉత్కంఠగా సాగిన అక్కడి వాతావరణంలో మార్పు వచ్చింది.


"ఎక్స్‌లెంట్ పెర్‌ఫార్మెన్స్"

"మార్వలెస్"

"ఇప్పటివరకూ మీరు నటించిన పాత్రలన్నీ ఒక ఎత్తైతే ఈ పాత్ర మీ సినీజీవితంలో మైలురాయి అయ్యేలా ఉంది మేడమ్"

ఒకరి తర్వాత ఒకరు ఆమె వద్దకొచ్చి ప్రశంసించారు. ఇలాంటివన్నీ ఆమెకు మామూలే. కానీ ఈ సినిమా మొదలైనప్పటినుంచి సులోచన పాత్ర తనకు బాగా తెలిసినట్టనిపించే... మరెందుకో ప్రతీ సన్నివేశంలో మరింత లీనమై చేస్తున్నట్టనిపిస్తుంది.

ఆమె పేరు నిశ్చల. నటించింది తక్కువ సినిమాలే అయినా...వచ్చిన గుర్తింపు మాత్రం అసమాన్యం. దానికి



కారణం ఆమె ప్రతిభే. ఆ సినిమా మొదలైనప్పట్నించీ దాని కథ ఎవరు తయారుచేశారన్న విషయం గురించి దర్శకుడిని అనేకసార్లు అడగాలనుకుంది. కానీ సందర్భం రాకపోవడంతో కుదర్లేదు.

అప్పటికి ఇంచుమించుగా నెలరోజులయ్యింది. ఆ రోజు పేకప్ అయిన తర్వాత వీలుకుదరడంతో "సార్! ఈ కథ మీరు తయారుచేసినదేనా?" అనడిగింది.

"కాదమ్మా ఈ మధ్య ఇండస్ట్రీకి కొత్తగా వచ్చిన ఓ కుర్రోడిది. ఇంతకుముందు నాలుగు హిట్ సినిమాలకు ఘోస్ట్ రైటర్‌గా పనిచేశాడు. పేరు సుదర్శన్" అని చెప్పి తిరిగి "దేనికమ్మా?" అని ప్రశ్నించాడు.

"అబ్బే...ఏం లేదండీ. ఇంత డెప్త్ ఉన్న సబ్జెక్ట్ మీరెప్పుడూ డీల్ చేయని కొత్త తరహా పాయింట్ కదా.." అంది.

అసిస్టెంట్ డైరెక్టర్ వచ్చి పిలవడంతో ఆ సంభాషణ అక్కడితో ముగిసింది. కానీ ఆమెలో సుదర్శన్ గురించి ఆలోచనలు అప్పుడే ఆరంభమయ్యాయి.

ఎందుకంటే

తాను నటిస్తున్న సినిమా కథంతా ఇంచుమించుగా తన తల్లి జీవితంలాగే ఉంది కాబట్టి. అతడు యాదృచ్ఛికంగా దీనిని రాసుండొచ్చా? ఏదేమైనా తర్వాత రోజు ఉదయాన్నే అతడిని పర్సనల్‌గా కలుసుకోవాలన్న నిర్ణయానికొచ్చింది. అలా అనుకున్న తర్వాత ఎందుకో తెలీదు గానీ మనసు తేలికపడినట్టైంది ఆమెకు.

* * *

ఉదయాన్నే సుదర్శన్ ఇంటికొచ్చి మాటామంతీ మాట్లాడిన తర్వాత

"మీకు పెళ్లైందా?" అని నిశ్చల అడిగింది.

"అబ్బే లేదండీ ఎందుకలా అడిగారు?"

"పెళ్ళికాకుండానే భార్యభర్తల మధ్య అవగాహనారాహిత్యం గురించి, వారి మధ్య కలిగే సున్నితభావాలు గురించి ఇంత హృద్యంగా ఎలా చెప్పగలిగారా అన్న అనుమానంతో అడిగాను"

"కొన్ని విషయాలు మనకి తెలియాలంటే అవి అనుభవించే తెలుసుకోనక్కర్లేదండి. చుట్టూ ఉన్న సమాజం, పరిస్థితులు కొన్ని నేర్పితే... మరికొన్నింటిని ఊహించడం ద్వారా దీనిని తయారుచేశాను"

"ఈ కథకు మీకు ఏదైనా స్ఫూర్తి ఉందా?"

"ఉంది"

"అదేమిటో చెప్పగలరా?"

"పర్సనల్... అయినా దీని గురించి ఇప్పుడు మరింత కూలంకషంగా తెలుసుకోవాల్సిన అవసరం ఏముంది. పైగా సినిమా చాలావరకూ అయిపోయిన తర్వాత కథ గురించి డిస్కషన్ ఏంటండి?" అని నవ్వుతూ అడిగాడు.

రాత్రంతా ఆమెకు నిద్రపట్టలేదు. ఏవేవో ఆలోచనలు. వాటన్నింటినీ కలిపితే ఏదో అస్పష్టమైన ఓ చిత్రం..దాన్ని పరిపూర్ణంగా, అందంగా చూడగలాలి అంటే అతనితో మరింత సంభాషించాలి. అతని గురించి తెలుసుకోవాలి.

"ప్రేమమీద మీ అభిప్రాయమేమిటి?" కప్పు టీపాయ్ మీద పెడుతూ అతడడిగిన ప్రశ్నకు ఆమె ఆలోచన్ల నుండి తేరుకుంది.

"స్త్రీ, పురుషుల మధ్య ఏ విధమైన దాపరికాలు, పొరపొచ్చాలు, రహస్యాలు లేకుండా ఒకరిపై ఒకరికి అమితంగా ఉండే నమ్మకమే ప్రేమంటే" సోఫాలో వెనక్కి వాలుతూ కాలుపై కాలేసుకుని అందామె.

"కదా! అటువంటి నమ్మకమనే కోటకి ఏ సందర్భంగానైనా చిన్న బీటవారితే - అసలు అలా జరగడానికి కార

